# తెలుగు మదిలో ఒదిగిన డా॥ వెలగా వెంకటప్పయ్య



జననం : 12-06-1932 - మరణం : 29-12-2014

**ఎలా బీజం పడిందో... ఆ పసి హృదయంలో పుస్తకమే సమస్తమని... అందులోనివన్నీ వాస్తవమని... తన చుట్టూ తిరిగే ఆలోచనలే కాదు.. ప్రకృతి ప్రతిబింబమంతా గ్రంథాలలోనే లభ్యమౌతుందని. అలా గూడుకట్టుకున్న ఆ చిన్న హృదయం పెరిగి, పెద్దై... చివరికి తానే ఓ నడిచే గ్రంథాలయమై... జీవితమే అందుకు లయమై... లోతులు వెతికే రాతలు... వెలుగులు పంచే కతలు... తాతలు... ముత్తాతలు... చెప్పే ఎన్నో... ఎన్నెన్నో నీతులు... ఆ చేతులలో పడి రచనా ప్రవాహాలై, విజ్ఞాన పుష్కరాలై, మానవజాతినే ప్రక్షాళనం చేసే మహత్తర చిత్తరువులై, ఆ మనిషి చరిత్రే తడి ఆరని మహాపుస్తకమై మన ముందు డాక్టర్ వెలగా వెంకటప్పయ్య యై... అయ్యంకి వెంకట రమణయ్య అనే గ్రంథాలయ పితామహ మహానుభావునికి వారసుడై... శ్రమైక జీవన సౌందర్యానికి నిలువెత్తు పుస్తకమై... రానున్న తరాలకు 'గ్రంథాలయ గాంధీయై' తెలుగుమదిలో ఒదిగిపోయారు.**

నిన్నటి వరకు పరుగులు తీసిన ఆ రూపం నేడు అపురూప శిలావిగ్రహం. కానీ ఆయన ప్రతిష్ఠించిన విలువలు, సాగించిన కృషి భావితరాలకు శాశ్వతగీతం. యింతకూ ఈ మొక్క మహావృక్షం అయ్యే క్రమంలో 'గంగ' పరవళ్ళు తొక్కుతూ అన్నింటినీ పవిత్రమొనరించినట్లు ఆ గుండెల్లో ఎన్ని విషయాలు గూడుకట్టుకున్నాయో? గిరకీలు తీసాయో? గుసగుసలాడుకున్నాయో? ప్రాణం పోసుకున్నాయో?... ఔను.. ఒక జాతిని నిద్రలేపటానికి, అనేక తరాలను విజ్ఞాన మూర్తులను చేయడానికి డా॥ వెలగా వంకటప్పయ్య తాను కరిగే కొవ్వొత్తిలా వెలుగులు చిందిస్తూ ఎన్నో నిద్రలేని రాత్రులు మిక్కిలిగా గడిపారు. 82 సం॥రాల జీవిత కాలంలో 164 సంవత్సరాల పనులు చేయగలిగారంటే మరి ఆయన నిద్రించెందపుడని?

అదే జరిగితే భారతదేశంలోని ప్రసిద్ధ విశ్వవిద్యాలయాలకు గ్రంథాలయ శాస్త్ర పాఠాలు ఉద్యోగం చేస్తూ ఎలా సమకూర్చగలిగేవారు? ఢిల్లీలోని ఇందిరాగాంధీ సార్వత్రిక విశ్వవిద్యాలయం మొదలు మన రాష్ట్రంలోని అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం వరకు, అలాగే శ్రీ వెంకటేశ్వర, కాకతీయ, నాగార్జున, తదితర విశ్వవిద్యాలయాలే కాకుండా ఏకంగా గ్రంథాలయ శిక్షణ కోసం సర్టిఫికెట్ కోర్స్ సిలబస్‌లు రూపొందించటం డా॥ వెలగాకే సాధ్యమయింది. నిజానికి ఈ అగ్నిపర్వతం ఓ చిరుద్యోగిగా గ్రంథాలయ సంస్థలోకి ప్రవేశించి ఒక్కొక్కటిగా అర్హతలు పెంచుకుని అందుకు తగిన హోదాలు అందుకుంటూ మరోవైపు డాక్టరేట్ పట్టా అందుకున్నారంటే వారి పట్టుదల స్థాయి తెలుస్తోంది. కాగా తానే ఉద్యోగుల నియమించే స్థితికి చేరారంటే అది ఆయనలోని అగ్ని జ్వాలే... వృత్తిలోపైకి రావటం ఆయన ఏర్పరచుకున్న లక్ష్యంలో చిన్న మజిలీ అని ఆ వెనక ఆయన చేసిన తిమింగలమంత సాహితీసేవ నిరూపిస్తోంది. అతి ముఖ్యంగా ఆయనలో నిలిచిన అమోఘ లక్షణం వసివాడని పసితనం. ఉత్సాహంతో హద్దులు తెలియని, అన్నీ చేసేయ్యాలని తపించే ఉత్తమ లక్షణమే. పసితనం మహాత్ములు సైతం వదులుకోకూడని మహనీయ గుణమైన శైశవం డా॥ వెలగా హృదయం.

ఉద్యోగ పర్వంతో మితం కాని వెలగా అమితంగా కృషి చేసిన బాల సాహితీ క్షేత్రంలో ఆయన 'సహస్ర కిరణ భానుడిలా' విజృంభించారు. బాలభానుడిగా బాలసాహిత్యానికి జాతీయ స్థాయిలో ప్రాణం పోశారు. ఆయన రచించిన వందలాది బాలల పుస్తకాల ద్వారా గ్రామగ్రామాన గల బాలబాలికలకు నాటి, నేటి ఉత్తమ నీతి కథలు, కవితలు, కథనాలు, శతకాలు జీవితచరిత్రలు రంగురంగుల చిత్రాలలో రమ్యమైన పదజాలంతో అలరించటం చూడవచ్చు. జానపద సాహిత్యం నేపథ్యంగా సాగే రచనలు వెలగాకు మంచిపేరు తెచ్చాయి. పెద్ద బాలశిక్ష, బయోగ్రఫీలు, శాస్త్రీయ గ్రంథాలయ చట్టాలు, బాలల బొమ్మల కథలు, సంపాదకత్వాలు ఇలా అనేకానేక ప్రయోగాలతో పిల్లలకు తద్వారా పెద్దలకు ఆయన చేరువయ్యారు. మధ్యాహ్న మార్తాండునిగా గ్రంథాలయ అంశాలను శాస్త్రీయ కోణంలో అధ్యయనం చేసి... వివిధ రాష్ట్ర ప్రభుత్వాలకు గ్రంథాలయ చట్టాలను రూపొందించి గొప్ప కృషి సల్పారు. పౌర గ్రంథాలయ నిర్వహణకు సంబంధించి, వెలగా ఒనరించిన కృషి ఆధునిక కాలంలో గ్రంథాలయాల నిర్వహణ ఒక ఛాలెంజ్ కాగా అందుకు జవాబు ఈ 82 ఏళ్ళ యువ పరిశోధకుడు పలు శాస్త్రీయ పద్ధతులను వెలగా అందుబాటులోకి తెచ్చారు.

గ్రంథాలయం ఒక ఆధునిక దేవాలయంగా ఒప్పుకునే వారికి

డా॥ వెలగా వెంకటప్పయ్యను మించిన అర్చకుడు ఆ రంగంలో లేరని అంగీకరించక తప్పదు. వారి పదార్చనలో తేట తెలుగుతోపాటు ఆంగ్లభాషలోనూ ఆయన ఘనాపాటియే. విస్తృత వ్యాసార్థంలో ఆయన గ్రంథాలయ చట్టాలను "లైబ్రరీ లెజిస్లేషన్" పేరుతో రానున్న తరాలకు నిక్షిప్తం చేసి పెట్టారు. "పబ్లిక్ లైబ్రేరి సిస్టమ్ సర్వీస్ అండ్ నెట్‌వర్క్" అంటూ గ్రంథాలయ రంగంలో భారత ప్రభుత్వ 'పద్మశ్రీ' అందుకునే స్థాయిలో వీరి కృషిని గుణించటం మన తెలుగువారి భాగ్యం. పిల్లలకు, పెద్దలకు, ప్రభుత్వ విధానాలకు, ప్రాంతీయ భాషా చైతన్యాలకు, పౌరుల విజ్ఞాన భాండాగారాలకు డా॥ వెలగా ఓ సమర్థ వారది. విస్తృత విహంగమైన ఈ సరస్వతీ పుత్రుని శత సహస్ర బాహువుల కృషి, నాటి శమంతక మణి కథను గుర్తు చేస్తుంది. రోజుకి అనేక బారువుల బంగారాన్ని ఆనాటి శమంతకమణి ప్రసాదిస్తే నిరంతర సౌజన్యవదనంతో, నిరాపేక్షంగా ప్రజలలో అజ్ఞానాంధకారాన్ని పారద్రోలే విజ్ఞాన గ్రంథాలను అసంఖ్యాకంగా ప్రచురించే పనిలోనే ప్రతిరోజు వయోభారాన్ని సైతం లెక్కించక శ్రుతి తప్పని వీణలా వెలగా తన సుమధుర క్రియలను చేసుకుంటూ వెళ్లారు. ఎన్నెన్ని పరిచయాలు, ఎన్నెన్ని ప్రసంగాలు, ఎన్నెన్ని చర్చలు, ఎన్నెన్ని కార్యక్రమాలు, కేంద్ర సాహిత్య అకాడమీ సలహా సంఘ సభ్యునిగా అనేకానేక విశిష్ట సంస్థలలో సంఘ సంస్కర్తలుగా పేరెన్నికగన్న మహోన్నత వ్యక్తులు చేసిన శక్తిమంతమైన పనులను ప్రజలకు గుర్తు చేసే ఆరాధనోత్సవాలను ఎంతోమంది మహనీయులు శతజయంతి ఉత్సవాలు సెమినార్లు, అవార్డుల ప్రదానోత్సవాలు, జయంతులు, వర్ధంతులు, పుస్తక ఆవిష్కరణలు, కవి సమ్మేళనాలు, వీటికి తగిన అతిథులు, అధ్యక్షులు వారి ఎంపికకై అతిరథ మహా రథులతో అగణిత శిష్య పరంపరతో చర్చోపచర్చ ఆహ్వానపత్రాలు – సమర్థ నిర్వహణా రీతులలో తానే ఓ గ్రంథాలయ పీఠాధిపతిగా డా॥ వెలగా వెంకటప్పయ్య సాగించిన సారస్వత యజ్ఞం సమస్త తెలుగు మండలాన్ని అభ్యుదయ సాహితీ వర్షంతో ముంచెత్తింది.

డా॥ వెలగా వెంకటప్పయ్య గారిలో కన్పించే మరో సుగుణం ప్రతిభకు పట్టం కట్టటం. "మీరేమిట్లు?" అనే ప్రశ్నకన్నా "మీరేమిటి ఇట్లు! రండి ఓ పనుంది" అంటూ యువకుల్ని, సాహితీ కిరణాలను, కవి కిశోరాలను, ప్రతిభను కన్పరిచిన ప్రతి ఒక్కరినీ స్త్రీ, పురుష బేధం లేకుండా ఎవరు ఎలాంటి పని చేయాలగలరో వారిని ఆ ప్రాంతంలో అలాంటి పనికి వినియోగించి, పెద్దలతో వారికి తగిన గుర్తింపును అందజేసి రాబోయే తరాన్ని సంసిద్ధం చేసే ముందు చూపుగల మనీషి డా॥ వెలగా.

విదేశాలలోని ప్రసిద్ధ గ్రంథాలయాలను దర్శించి రావటం వెలగా ఆలోచనాలోచనాలకు ఆసరాయి పట్టింది. సహజ సుగంధదారులైన వెలగా అక్కడి అత్యుత్తమ విలువలను భారతీయులకు ఏ శాస్త్రీయంగా మేళవించి మేధోభరితమైన యువతను దేశానికి అందజేసే ఆధునిక గ్రంథాలయాలు, వాటి అంతర్గత పనితీరు, మౌలిక వసతుల కల్పన, సమర్థ నిర్వహణ, జవాబుదారీతనం, ప్రోత్సాహక విద్యా విధానం, కంప్యూటర్ మేళ వింపులు, నైతిక మదింపులు, నిర్దిష్ట పద్ధతులు, సమసమాజ నైష్పత్తిక తేజో వికాస ప్రణాళికలు, నిరంతరంగా రచిస్తూ తాను కాలూనిన గ్రంథాలయ రంగానికి తన జీవితాన్ని అంకితం చేయటం కన్నా "అంతకుమించి" లీనమైన సమకాలీనులు డా॥ వెలగా వెంకటప్పయ్య.

దాతల దాతృత్వాన్ని దర్శనీయ గ్రంథాలయాలుగా – భావిజాతి తేజోబీజాలుగా, పుస్తక మహళ్ళుగా మలిచిన మేధావిదాత డా॥ వెలగా. వివిధ ప్రసిద్ధ విశ్వవిద్యాలయాలు, ధార్మిక సంస్థల నేతృత్వంలో కళాపీఠాల ఆధ్వర్యంలో ఉత్తమ సేవా పురస్కారాల నిమిత్తం శాశ్వత ధర్మనిధులను ఏర్పరచటంలో వెలగా కృషి మాననీయం. ఆయన శ్వాస, ధ్యాస, ఆశ, మిష, ఘోష సమస్తం గ్రంథాలయం – మానవాభ్యుదయం.

ఆంగ్లంలో ఓ సామెత ఉంది "Without books, God is silent" మనిషికి కన్పించని దేవుని నివాసం పుస్తకమే. మస్తకానికెక్కే పుస్తక రూపమే లేకుంటే ఆ దేవుడు సైతం మానవుడి అభివృద్ధి విషయంలో నిశ్శబ్దుడు అని దాని అర్థం కావచ్చు. దేవుడిని చేరే దారులు ఎన్ని అవి అన్నీ తరతరాలకూ అందించే రహదారి పుస్తక రూపమే. బహుశా అందుకనేమో గొప్ప గొప్ప భక్త శిఖామణులందరూ వారి విశ్వాస మార్గాలను గ్రంథాలుగా మలిచి ఉంచారు. గొప్ప గొప్ప శాస్త్రవేత్తలందరూ వారి సిద్ధాంత సూత్రాలన్నీ పుస్తకాలుగా రాసి ఉంచారు. పెద్ద పెద్ద నేతలు, సంఘ సంస్కర్తలు, మానవాభ్యుదయ మూర్తులందరూ తమ రాతల ద్వారానే శాశ్వత విలువల స్థాపనకు తమవంతు కృషి చేశారు. వారు వీరనే భేదం లేకుండా, దేశం, ప్రాంతం అనే వాదం లేకుండా సమస్త ఖండ ఖండాంతర ప్రపంచమంతా పుస్తక రూపంలోనే పరస్పర బంధాలను భావితరాల కోసం సంసిద్ధం చేసి ఉంచుకుంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన పరికరాలు నిమిష నిమిషానికీ మారుతున్నాయి. కొన్ని గతి తప్పి పోతున్నాయి. కానీ పుస్తకం ఎప్పటికీ హస్త భూషణమే. దాని విలువ అమూల్యమే. అలాంటి శాశ్వతవిలువలను, సార్వకాలీన సార్వజనీనమైన వస్తువు కోసం డా॥ వెలగా తన జీవితాన్ని ధారపోయటంలో ఆయన నిర్వహించిన తపస్సు ఆయనను అమూల్యమైన ఆణిముత్యంగా నిలిపి, గెలిపించింది. ఆ పుస్తకానికి సంబంధించిన సంపూర్ణ భౌతిక, అభౌతిక కార్యాచరణతో ఆధునిక రుషిగా రూపొందిన డా॥ వెలగా కృషి ఎంతైనా శ్లాఘనీయం. ఆ కృషిలో ఆయనకు లభించిన గౌరవ మర్యాదలు ఆప్త వర్గాలు, నిర్వహించిన ఉద్యోగ హోదాలు, అందుకు అతీతమైన ఆత్మానుభూతి పరిశోధనలు, ప్రజా సంబంధాలు, శిష్య బాంధవ్యాలు, హేమా హేమీలతో కొనసాగిన రమణీయ కార్యక్రమాలు డాక్టర్ వెలగా వెంకటప్పయ్య జీవన పతాకను తారాపథాన రెపరెపలాడేలా చేసింది. యింత సాధించిన మనిషి తన కుటుంబ జీవాతాన్ని త్యాగం చేసినట్లైతే ఆయనకు జగమంతా కుటుంబమే తానొక తరువై, తరతరాలకు మరవని గ్రంథాలయ గురువై, బాలలకు, జాబిలియై, కోమలమైన పద సంపదతో అసంఖ్యాల పుస్తకాలను రచించిన మంచి రచయితయై భావితరాలకు వేగుచుక్కలా వినువీధిన ప్రకాశించిన డా॥ వెలగా జీవితం ధన్యం.

**- ఎమ్మెస్వీ సత్యనారాయణబాబు, 9291497660**